మండుటెండల్లో సాగు నీరందించిన ఘనత కేసీఆర్‌దే

రైతులతో కలిసి ఉప్ప కుంట చెరువును పరిశీలిస్తున్న జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత

- కాంగ్రెస్ హయాంలో పంటలు ఎండిపోతున్నయ్
- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మార్చి 7: మండుటెండల్లో సైతం చెరువులు మత్తడి దూకి, చివరి ఆయకట్టు వరకు నీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జగిత్యాల రూరల్ మండలం వంజెరపల్లె గ్రామంలో ఎండిపోయిన ఉప్పుకుంట చెరువును శుక్రవారం ఆమె నాయకులు, రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దావ వసంత మాట్లాడుతూ, ఉప్పుకుంట చెరువు పూర్తిగా ఎండిపోవడంతో సుమారు 200 ఎకరాల్లో వరి ఎండిపోతున్నదని పేర్కొన్నారు. అధికారులతో ఫోన్లో మాట్లాడి పొలాలకు నీరందించాలని కోరారు. కాంగ్రెస్ హయాంలో నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని చెప్పారు. ప్రభుత్వం వెంటనే పంట పొలాలకు నీరందించాలని రైతన్నల పక్షాన డిమాండ్ చేశారు. ఆమె బీఆర్ఎస్ నాయకులు ఆనంద రావు, కమలాకర్‌రావు, రావి రాజు, తిరుపతి, మహేశ్, గంగారెడ్డి, శంకర్, సురేశ్, హరీశ్ యాదవ్, ధర్మయ్య పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ సత్యప్రసాద్
- వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో సమీక్ష

సమావేశానికి హాజరైన వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, మార్చి 7: ప్రభుత్వ దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ వైద్యాధికారులను ఆదేశించారు. జగిత్యాలలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జన ఔషధి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జిల్లాలోని వైద్యాధికారులు, ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సబ్ సెంటర్లు, పీహెచ్‌సీల్లో ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గర్భిణులు ప్రసవం కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో వైద్య సేవలు, సదుపాయాల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. టీబీ పరీక్షలు ప్రణాళిక ప్రకారం చేయాలన్నారు. ఎండదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూలీలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్ ప్రమోద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ఆర్ఎంవో, డాక్టర్లు, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

జగిత్యాల, మార్చి 7: ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇస్తున్నదని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ కోరారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన మున్సిపల్, ఎంపీడీవో, ఎంపీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ, ఇతర అధికారులతో ఎల్ఆర్ఎస్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల వారీగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల వివరాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, లే-అవుట్ లేని ప్లాట్ల క్రమబద్ధీకరణ, తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ లైసెన్స్ సర్వేయర్లు కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎల్ఆర్ఎస్ కోసం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, డీపీవో మదన్‌మోహన్, టౌన్ ప్లానింగ్ అధికారి శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

కోరుట్ల, మార్చి 7: పట్టణంలోని కాముడి పెంట ప్రాంతంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ-2 రామచంద్రం, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని కాముడి పెంట ప్రాంతంలో నివాసం ఉంటున్న మైలారపు అంజయ్య-భవాని దంపతులు గత నెల 25న ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న కుమారుడి వద్దకు వెళ్లారు. గురువారం రాత్రికి కోరుట్లలోని తమ నివాసానికి తిరిగి వచ్చారు. ఇంటికి వేసిన తాళం కొక్కెం తొలగించి ఉండడం, బీరువాలోని వస్తువులు చిందర వందరగా పడి ఉండడంతో అనుమానం వచ్చి చూడగా, బీరువాలో భద్రపరిచిన మూడున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ. 50 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు సమాచారం అందించగా, ఘటనాస్థలికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదాంను పరిశీలించిన జిల్లా వ్యవసాయాధికారి

గోదాంలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్

కొడిమ్యాల, మార్చి 7: మండలంలోని పూడూర్‌లో గల గోదాంను శుక్రవారం జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ పరిశీలించారు. రికార్డులను పరిశీలించి, స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. నమిలికొండ గ్రామంలో ఏఈవోలు చేపడుతున్న డిజిటల్ క్రాప్ సర్వే, పూడూర్‌లో వరి పొలాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏవో జ్యోతి, సీఈవో రాజేందర్, ఏఈవో రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

బల్దియా ఎదుట మున్సిపల్ కార్మికుల ధర్నా

కార్పొరేషన్, మార్చి 7: కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ నగరపాలక సంస్థ కార్మికులు శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో బల్దియా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి మాట్లాడుతూ, ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరుతున్న దృష్ట్యా కార్మికులకు ఒక్క పూట ఉదయం 5 నుంచి 12గంటల వరకు విధులు కేటాయించాలన్నారు. కార్మికుడు లేదా కార్మికురాలు చనిపోయినా, అనారోగ్యానికి గురైనా వారి స్థానంలో కుటుంబ సభ్యులను నియమించేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. కొన్ని సంవత్సరాలుగా డ్రైవర్ విధులు నిర్వహిస్తున్న వారికి డ్రైవర్ కేటగిరీ వేతనాన్ని అమలు చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

కోతులు, కుక్కల నుంచి రక్షణ కల్పించాలి

కోరుట్ల రూరల్, మార్చి 7: మోహన్‌రావుపేట గ్రామంలో కోతులు, కుక్కల బారి నుంచి రక్షణ కల్పించాలని కార్యదర్శి సరితకు శుక్రవారం గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. కుక్కలు, కోతుల బెడదతో ఇండ్ల నుంచి బయటకు రావడానికి జంకుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

మల్లాపూర్, మార్చి 7: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6 నుంచి పదో తరగతిలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భూమేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 10వ తేదీలోగా స్టడీ సర్టిఫికేట్లతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నీటి కోసం ఇక్కట్లు

కథలాపూర్, మార్చి 7: కథలాపూర్ మండలం భూషణరావుపేటలో రెండు రోజులుగా నల్లానీరు రావడంలేదని గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. దీంతో నీటి కోసం ఇబ్బందులు పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి నల్లానీరు యథావిధిగా సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కథలాపూర్, మార్చి 7: కథలాపూర్ మండలం తక్కళ్లపెల్లి గ్రామానికి చెందిన గుగ్గిల్ల గంగు (70) అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. గంగు తన ఇంట్లో ఒంటరిగా ఉంటున్నది. గురువారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగిరాకపోవడంతో ఆమె బంధువులు పలువురిని వాకాబు చేశారు. గంగు అదృశ్యమైనట్లు ఆమె బంధువు గుగ్గిల్ల రాజారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి.,
జగిత్యాల శాఖ, జగిత్యాల, జి: జగిత్యాల (తెలంగాణ రాష్ట్రం)
స్వాధీనతా ప్రకటన (రూల్ 8(i)) (స్థిరాస్తి కొరకు)

ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., జగిత్యాల శాఖ యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్టు చట్టం 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంటరెస్టు (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 లోని రూలు 3తో చదువుకోవల్సిన సెక్షన్ 13 (2) క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ సదరు నోటీసు అందిన తేదీ నుండి 60 రోజులలోపు సదరు నోటీసులో తెలిపిన రూ. 26,91,298.60 (అక్షరాల రూపాయలు ఇరవై ఆరు లక్షల తొంబై ఒక్క వేల రెండు వందల తొంబై ఎనిమిది రూపాయల అరవై పైసలు మాత్రమే) లను మరియు తేదీ 01-08-2024 నుండి దానిపై వడ్డీ మరియు ఖర్చులు చెల్లించవలసిందిగా ఋణగ్రహీతలు అయిన 1. శ్రీ ఆరెల్లి చంద్ర మోహన్, తండ్రి వెంకటయ్య & 2. శ్రీమతి రేకుంట రాధిక రాణి, భర్త ఆరెల్లి చంద్ర మోహన్, ఇంటి నెం. 8-1-238, గోదావరిఖని, రామగుండం, పెద్దపల్లి జిల్లా గారిని కోరుతూ, తేదీ: 11-09-2024 న ఒక డిమాండు నోటీసు జారీ చేశారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించడంలో ఋణగ్రహీత విఫలమైనందున ఋణగ్రహీతలకు / హామీదారులకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ప్రకటించునది ఏమనగా సదరు చట్టంలోని రూలు 8తో చదువుకోవల్సిన సదరు సెక్షన్ 13 (4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగించుకుంటూ, దిగువ సంతకందారు, దిగువ వివరించబడిన ఆస్తిని, తేదీ: 04 మార్చి 2025 రోజున స్వాధీనపర్చుకోవడం జరిగింది.

ఇందుమూలముగా ముఖ్యంగా ఋణగ్రహీతలను / హామీదారును మరియు సాధారణ ప్రజానీకాన్ని హెచ్చరించునది ఏమనగా, సదరు ఆస్తితో ఎవ్వరు ఎలాంటి లావాదేవీలను చేయరాదు. సదరు ఆస్తితో జరిపే ఏదైనా లావాదేవీలైన రూ. 26,91,298.60 (అక్షరాల రూపాయలు ఇరవై ఆరు లక్షల తొంబై ఒక్క వేల రెండు వందల తొంబై ఎనిమిది రూపాయల అరవై పైసలు మాత్రమే) మరియు తేదీ 01-08-2024 నుండి దానిపై వడ్డీ మరియు ఇతర ఖర్చులతో గల బకాయి మొత్తానికి, ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి., జగిత్యాల శాఖ యొక్క చార్జీకి లోబడి ఉంటాయి.

-: స్థిరాస్తి వివరములు :-

ఆస్తి వివరాలు	: ఆర్.సి.సి. గ్రౌండ్+1 ఫ్లోర్స్ గల ఇల్లు.
ఎవరిపేరిట యున్నది	: శ్రీ ఆరెల్లి చంద్ర మోహన్, తండ్రి వెంకటయ్య.
ఇంటి / ప్లాటు నంబరు	: ఇ. నెం. 1-1-146 (అసెస్‌మెంట్ నెం. 1101007758), 1-1-146/1 (అసెస్‌మెంట్ నెం. 1101020405), సర్వే నెం. 457/A.
పట్టణం / మండలం	: జంబిగద్దె, జగిత్యాల పట్టణం మరియు మున్సిపాలిటీ.
విస్తీర్ణము	: 207.00 చదరపు గజములు లేదా 174.07 చదరపు మీటర్లు.

-: హద్దులు :-

ఉత్తరం: రోడ్డు, దక్షిణం: శైలేందర్ రెడ్డి గారి ఇల్లు (ఇ.నెం. 1-1-148), తూర్పు: బి. వెంకన్న గారి ఇల్లు (ఇ. నెం. 1-1-140), ఎస్. రాజం గారి ఇల్లు (ఇ. నెం. 1-1-140/1) మరియు సిహెచ్. మల్లేశ్ గారి ఇల్లు (ఇ. నెం. 1-1-141), పడమర: కోల భూమయ్య గారి ఇల్లు (ఇ. నెం. 1-1-147).

అధీకృత అధికారి
ది గాయత్రి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు లి.
జగిత్యాల శాఖ

స్థలం: జగిత్యాల
తేదీ: 07-03-2025

శాతవాహన సర్జన్స్ అధ్యక్షుడిగా వాసుదేవ శ్రీనివాస్

విద్యానగర్, మార్చి 7: కరీంనగర్ జిల్లా సర్జన్స్ అందరిని ఒకే చత్రం కిందికి తెస్తూ శుక్రవారం మైత్రి హోటల్‌లో జరిగిన సమావేశంలో కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్ ఆవిర్భవించింది. ప్రెసిడెంట్‌గా డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ (వాసుదేవ హాస్పిటల్), సెక్రటరీగా డాక్టర్ వి. మంగీలాల్, ట్రెజరర్‌గా డాక్టర్ సాయి ప్రసాద్, ఇతర కార్యవర్గ సభ్యులను సర్జన్స్ ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గానికి కరీంనగర్ అసోసియేషన్ ఆఫ్ శాతవాహన సర్జన్స్‌తో పాటు ఐఎంఏ కరీంనగర్ ప్రెసిడెంట్ డాక్టర్ నరేశ్, టీఎస్ ఎంసీ మెంబర్లు డాక్టర్ బండారి రాజ్ కుమార్, డాక్టర్ అమిత్, తానా కరీంనగర్ ప్రెసిడెంట్ డాక్టర్ చాట్ల శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర తానా ప్రెసిడెంట్ డాక్టర్ సురేశ్, అలయన్స్ క్లబ్ ప్రతినిధులు, లయన్స్ ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాల తనిఖీ

కోరుట్ల, మార్చి 7: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో నిర్వహిస్తున్న ఇంటర్ పరీక్ష కేంద్రాలను మెట్‌పల్లి డీఎస్పీ రాములు శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా పరీక్ష కేంద్రాల వద్ద భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ సురేశ్‌బాబు, ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పసుపునకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఆత్మకూర్‌లో నినాదాలు చేస్తున్న రైతు ఐక్యవేదిక సంఘం నాయకులు

- మహాధర్నాకు రైతులంతా తరలిరావాలి
- రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి

మెట్‌పల్లి రూరల్, మార్చి 7: పసుపు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని రైతు ఐక్యవేదిక రాష్ట్ర నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు రూ. 15 వేలు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. పసుపు రైతుల సమస్యల పరిష్కారం, డిమాండ్ల సాధన కోసం ఈనెల 11న మెట్‌పల్లిలో రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో మహాధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని జగ్గసాగర్, రామలచ్చక్కపేట, ఆత్మకూర్ గ్రామాల్లో శుక్రవారం ఆయన రైతులు, రైతు సంఘాల నాయకులు, గ్రామ పెద్దలను కలిసి మహాధర్నాకు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, గతేడాది క్వింటాల్ పసుపు రూ. 16 వేల నుంచి రూ. 18 వేల వరకు ధర పలికిందని, ప్రస్తుతం రూ. 8 వేల నుంచి రూ. 11 వేల వరకు మాత్రమే పలుకుతోందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పసుపు కొనుగోలు చేసిన విధంగానే ప్రస్తుత ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సహకార సంఘం మాజీ అధ్యక్షుడు మారు మురళీధర్‌రెడ్డి, రైతులు కొట్టాల మోహన్‌రెడ్డి, వేముల కరుణాకర్‌రెడ్డి, కుంట సాయిరెడ్డి, రాజిరెడ్డి, సురేశ్, తిరుపతి, నరేశ్, లింగారెడ్డి, గడ్డం లింగారెడ్డి, గంగారాం, భూమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోరుట్ల/కొడిమ్యాల/ఇబ్రహీంపట్నం, మార్చి 7: కోరుట్ల పట్టణంలోని కల్లూరురోడ్డు, పెద్ద గుండు విద్యుత్ సబ్ స్టేషన్లలో శనివారం వార్షిక మరమ్మతులు చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ 1, 2 ఏఈలు శ్యాం, సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సబ్ స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. కొడిమ్యాల మండలం కొడిమ్యాల, రామకిష్టాపూర్, కొండాపూర్, చింతలపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘునాథ్ తెలిపారు. మల్యాల మండలం మల్యాల, ముత్యంపేట, రాజారాం, నూకపల్లి, తక్కళ్లపల్లి, మ్యాడంపల్లి, మానాల గ్రామాలకు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మేడిపల్లి, బండలింగాపూర్, సత్తెక్కపల్లి, రాజేశ్వర్‌రావుపేట, ఎర్రాపూర్ గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రశాంత్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

జడ్పీ సీఈవో గౌతంరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

జడ్పీ సీఈవోను కలిసిన ఉద్యోగులు

జగిత్యాల, మార్చి 7: పంచాయతీ రాజ్ శాఖలో పని చేస్తున్న జూనియర్ అసిస్టెంట్, టైపిస్టుల సీనియార్టీ జాబితాలో కొత్తగా వచ్చిన వీఆర్వో, వీఆర్ఏలను చేర్చడంతో సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరుగుతున్నదని పంచాయతీ రాజ్ ఉద్యోగులు శుక్రవారం జడ్పీ సీఈవో గౌతం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీనియార్టీ ఉద్యోగుల జాబితా సవరణ చేసి తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు అవమానం

- నాగునూర్‌లో విగ్రహానికి చెప్పుల దండ
- గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య
- నిందితులను కఠినంగా శిక్షించాలని నిరసనలు

సారంగాపూర్, మార్చి 7: జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం నాగునూర్ గ్రామంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేసి అవమానించారు. ఈ విషయాన్ని స్థానిక అంబేద్కర్ సంఘం నాయకులు పోలీసులకు చెప్పడంతో గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. పలువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేసి, అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

కోర్టుచౌరస్తా, మార్చి 7: మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని కరీంనగర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. ప్రతిమ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, మహిళలు పురుషులు చేసే ప్రతి పనినీ నేడు చేస్తున్నారని గుర్తు చేశారు. మహిళలు మానసికంగా బలంగా ఉన్నప్పుడే మరింత రాణించగలరన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.వి రాజ్‌మార్, కార్యదర్శి బేతి మహేందర్, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, జిల్లా న్యాయమూర్తులు, మేజిస్ట్రేట్లు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో విద్యార్థిని ప్రతిభ

కొత్తపల్లి, మార్చి 7 : జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో డీఈవో ఆధ్వర్యంలో తొమ్మిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్ ఒలింపియాడ్ పరీక్షలో మండలంలోని ఎలగందుల జడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థిని ఆర్ రిషిత పటేల్ జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు గోల్డ్ మెడల్ సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు తుమ్మ ఆనందం పేర్కొన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అల్ఫోర్స్ పాఠశాల యాజమాన్యం నిర్వహించిన పోటీల్లో జిల్లాస్థాయిలో ప్రథమ ర్యాంకు రావడం సంతోషంగా ఉందన్నారు. రిషిత పటేల్‌ను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

కొండగట్టులో పవిత్రోత్సవాలు

కొడిమ్యాల, మార్చి 7: కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శ్రీకాంతరావు తెలిపారు. ఉత్సవాలకు భక్తులు తరలిరావాలని కోరారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

తెలంగాణచౌక్, మార్చి 7: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గీట్ల ముకుందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎడ్ల రమేశ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ శ్రీలత ఆధ్వర్యంలో శుక్రవారం నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మహిళలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రెస్ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

బ్యాంకు ఉద్యోగుల నిరసన

విద్యానగర్, మార్చి 7: యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంకు యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్ని పబ్లిక్ సెక్టార్ బ్యాంకుల ఎంప్లాయీస్, ఆఫీసర్స్, యూనియన్ నాయకులు యూనియన్ బ్యాంకు రీజనల్ బ్యాంకు ఆఫీస్ ఎదుట నిరసన తెలిపారు. 5 రోజుల పని దినాలు అమలు చేయాలని, బ్యాంకుల్లో వెంటనే రిక్రూట్‌మెంట్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ నెల 24, 25 తేదీలో దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చారు. నిరసనలో 150 మంది ఉద్యోగులతో పాటు సమన్వయ కమిటీ సెక్రటరీ దామోదర్, అధ్యక్షుడు నిఖిల్, వెంకటేశ్, హరికృష్ణ, మహేందర్, రాకేశ్, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదువాలి

గంగాధర, మార్చి 7: మండలంలోని ర్యాలపల్లి ప్రభుత్వ పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన తాజా మాజీ ఎంపీటీసీ అట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి కన్నవారికి, ఊరికి, పాఠశాలకు పేరు తేవాలని సూచించారు. విద్యార్థులకు టై, బెల్టులు అందజేశారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మి, ఉపాధ్యాయులు మంజులవాణి, జయశ్రీ, రుద్రమదేవి పాల్గొన్నారు.

ఉపాధిహామీ సామాజిక తనిఖీ

గంగాధర, మార్చి 7: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉపాధిహామీ సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతేడాది కాలంలో మండలంలోని 33 గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనులపై తనిఖీ బృందం సభ్యులు తయారు చేసిన నివేదికలను సామాజిక తనిఖీలో వెల్లడించారు. పనులు, చెల్లించిన కూలి, పెండింగ్ చెల్లింపులు, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, ఎంపీడీవో రాము, పంచాయతీ కార్యదర్శులుపాల్గొన్నారు.

పోషకాలతోనే రక్తహీనత దూరం

శంకరపట్నం, మార్చి 7: మహిళలు సరైన పోషకాలు తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, అరుణ తెలిపారు. శుక్రవారం సభలో భాగంగా కేశవపట్నం, గద్దపాక అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల తల్లులకు ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన ఆహారం గురించి వివరించారు.

పసుపు క్వింటాల్ @ రూ.10,777

మెట్‌పల్లి, మార్చి 7: మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్‌లో పసుపు క్రయ విక్రయాలు జోరందుకున్నాయి. శుక్రవారం పసుపు కాడి (కొమ్ము) క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ. 10,777, కనిష్ఠంగా రూ.6,688, పసుపు మండ (గోళ)కు గరిష్ఠంగా రూ.10,251, కనిష్ఠంగా రూ.6,666, చూర క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.9,012, కనిష్ఠంగా రూ.6,511 పలికింది. 1608 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు మార్కెట్‌లో 16322 క్వింటాళ్ల పసుపు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే దాముకు నివాళి

మెట్‌పల్లి, మార్చి 7: మెట్‌పల్లి మాజీ ఎమ్మెల్యే తుమ్మల వెంకటరమణారెడ్డి(దాము) జయంతి సందర్భంగా శుక్రవారం మెట్‌పల్లిలో బీజేపీ శ్రేణులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, నాయకులు డా. చిట్నేని రఘు, సుఖేందర్‌గౌడ్, ఇల్లెందుల కృష్ణమాచారి, అంబల్ల జగన్, గడ్డం రాజారెడ్డి, ఆర్‌కే గణేశ్, కొండ్లెపు శ్రీనివాస్, సుతారి లింగారెడ్డి, తోకల సత్యనారాయణ, వేముల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రోక్షణ పూజలు

ధర్మపురి, మార్చి 7: ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కల్యాణోత్సవానికి ఆలయ సమీపంలోని శ్రీమఠం స్థలంలో శుక్రవారం పండితులు మంత్రోచ్ఛరణలతో సంప్రోక్షణ పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఈవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ధర్మపురి రూరల్, మార్చి 7: ధర్మపురి మండలం రాయపట్నం వద్ద శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలింది. మృతుడి వయసు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య ఉంటుందని, నిలువు గీతలతో కూడిన ఎరుపు రంగు చొక్కా ధరించినట్లు ఎస్ఐ ఉదయ్‌కుమార్ తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు సెల్ నంబర్ 87126 56824లో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం అందజేత

కొడిమ్యాల, మార్చి 7: మండల కేంద్రానికి చెందిన చొక్కాల సాయి కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రూ. 10 వేల నగదు పంపించగా, మల్యాల ఏఎంసీ వైస్ చైర్మన్ గడ్డం జీవన్‌రెడ్డి శుక్రవారం దవాఖానకు వెళ్లి అందజేశారు.

నాణ్యతా ప్రమాణాలపై సమీక్ష

జగిత్యాల, మార్చి 7: జగిత్యాలలోని ఎస్ఈ కార్యాలయంలో జిల్లాలోని విద్యుత్ సంస్థకు సంబంధించిన కాంట్రాక్టర్లతో నాణ్యతా ప్రమాణాలపై శుక్రవారం క్వాలిటీ కంట్రోల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పనుల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఈ సాలియా నాయక్, ఆపరేషన్స్ డీఈ, డీఈలు, ఏడీలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

రాయికల్, మార్చి 7: జిల్లాకు చెందిన ఆశ కార్యకర్తపై లైంగిక దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రాయికల్ ఎస్ఐ సుధీర్‌రావు తెలిపారు. రాయికల్ పట్టణానికి చెందిన మొక్కల రాజు గత నెల 27న ఆశ కార్యకర్తపై లైంగిక దాడి చేసినట్లు పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

కొడిమ్యాల, మార్చి 7: మండలంలోని సండ్రల్లపల్లి కస్తూర్బాలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు మేమున్నాం స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి లావణ్య, స్వచ్ఛంద సంస్థ సభ్యులు మొగిలిపాలెం శ్రీనివాస్, సురుగు సుదర్శన్, తదితరులున్నారు.

అలరించిన స్వాగతోత్సవం

జగిత్యాల టౌన్, మార్చి 7: జగిత్యాలలోని పొలాస వ్యవసాయ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బీఎస్సీ అగ్రికల్చర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతోత్సవం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సెషన్స్ జడ్జి నీలిమ మాట్లాడుతూ, యువత సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ భారతీనారాయణ భట్, ఆర్ఏఆర్ఎస్ జగిత్యాల అసోసియేట్ డైరెక్టర్ శ్రీలత, వోఐఎస్ఏ డాక్టర్ ఎన్ మహేశ్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రంగు మారిన మిషన్ భగీరథ నీరు

- నీటిని వినియోగించేందుకు జంకుతున్న ప్రజలు

కోరుట్ల, మార్చి 7: కోరుట్లలో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచి పోయింది. శుక్రవారం కొద్ది సమయం మాత్రమే అధికారులు మంచినీటిని సరఫరా చేశారు. రంగుమారిన నీరు సరఫరా కావడంతో నీటిని తాగేందుకు, వినియోగించేందుకు ప్రజలు జంకుతున్నారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా కోరుట్లలో నీటి సరఫరాను నిలిపి వేయడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ డీఈఈ సురేశ్‌ను వివరణ కోరగా ట్రీట్‌మెంట్ ప్లాంట్ వద్ద శుద్ధీకరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు.

ప్రమాదవశాత్తు సిలిండర్ నుంచి మంటలు

జగిత్యాల రూరల్, మార్చి 7: టీఆర్‌నగర్‌లోని ఉర్దూ మీడియం పాఠశాల పక్కనే ఉన్న ఓ ఇంట్లో శుక్రవారం వంట చేస్తుండగా ప్రమాదవశాత్తు సిలిండర్ నుంచి మంటలు చెలరేగాయి. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ. 20 వేలు వరకు నష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు. అగ్నిమాపక అధికారులు కృష్ణకాంత్, మధు, ఆపరేటర్లు వెంకటేశ్వర్లు, సుధాకర్, ఫైర్‌మెన్లు ఎం వేణు, ఎం రాజేందర్, వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కోరుట్లలో రోడ్డు ప్రమాదం

- ఆర్టీసీ బస్సు, మరో లారీని ఢీకొట్టిన లారీ

కోరుట్ల, మార్చి 7: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మెట్‌పల్లి నుంచి జగిత్యాలకు వెళ్తున్న లారీ అదుపుతప్పి డిపోలోకి ప్రవేశిస్తున్న జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వెనుక భాగాన్ని బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో బస్సును తప్పించబోయిన లారీ డ్రైవర్ ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టాడు. చివరకు డివైడర్‌ను ఢీకొని లారీ నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులో ఇద్దరు ప్రయాణికులు ఉండగా, వారు ముందు భాగంలో కూర్చోవడంతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాగా, ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాస్‌రెడ్డి

ధర్మపురి, మార్చి 7: పెగడపల్లి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం ధర్మపురి పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ధర్మపురి మున్సిపల్ కమిషనర్ కందుకూరి శ్రీనివాస్ గురువారం లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికాడు. కాగా, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జి కమిషనర్‌గా శ్రీనివాస్ రెడ్డి అదనపు బాధ్యతలు స్వీకరించారు.